nipuna
Every Wednesday Free Supplement
05.
23 ఏప్రిల్ 2025
పేజీలు 8



## సురక్షిత దేశాలు

నంబియో భద్రతా సూచిక 147 దేశాలతో ఏప్రిల్ 1న విడుదలైంది. దీనిలో నైరుతి యూరప్‌లోని చిన్న దేశం అండొర్రా అత్యంత సురక్షితమైన దేశంగా టాప్ ర్యాంక్ దక్కించుకుంది. యూఏఈ 2, ఖతార్ 3, తైవాన్ 4, ఒమన్ 5 ర్యాంకుల్లో నిలిచాయి. భారత్ 66వ ర్యాంకులో ఉండగా పాకిస్థాన్ 65, అమెరికా 89, బ్రిటన్ 87, చైనా 15వ ర్యాంకులో ఉన్నాయి. టాప్-5 ప్రమాదకర దేశాల్లో వెనెజులా 1, పపువా న్యూగినియా 2, హైతీ 3, అఫ్గానిస్థాన్ 4, దక్షిణాఫ్రికా 5వ ర్యాంకులో ఉన్నాయి. ఆయా దేశాల్లో భద్రతా పరిస్థితులు, నేరాల రేటు, ప్రజల జీవన ప్రమాణాలు పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకింగ్స్ ప్రకటించారు.

# 'పది'లమైన కోర్సులు.. ప్రపంచం వైపు అడుగులు



**కొన్ని వారాల క్రితం స్కూల్స్ బయట తల్లిదండ్రులు ఎండలో నిలబడి ఉండటం చూసుంటారు. మార్చి, ఏప్రిల్ నెలలో అంతమందిని చూడగానే గుర్తొచ్చేది పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయని. ఎన్ని తరాలు మారినా ఈ విషయంలో మార్పు రాదు. విద్యార్థుల జీవితంలో రాసే మొదటి బోర్డు పరీక్షల వెనుక తల్లిదండ్రుల ఎన్నో ఆశలు, ఆశయాలు, భావోద్వేగాలు ఉంటాయి. ఎందుకంటే ప్రపంచం వైపు వేసే మొదటి అడుగు పదో తరగతి తరువాత మొదలవుతుంది కాబట్టి. త్వరలో పది ఫలితాలు కూడా వెలువడుతాయి. పది తరువాత ఏం చేయాలనేదానిపై కొంతమంది ముందే నిర్ణయించుకుంటారు. మరికొంత మంది తర్జనభర్జన పడుతుంటారు. వారి కోసమే ఈ వివరాలు అందిస్తున్నాం.**

### ఏ కోర్సులు తీసుకోవాలి?

- ఎంచుకునే కోర్సులు అనుకున్న కెరీర్ దిశగా తీసుకెళ్లేదిగా ఉండాలి. 12వ తరగతి తరువాత రాసే కెరీర్ ఎంట్రన్స్ పరీక్షల్లో ఎలిజిబిలిటీ కోసం ఇంటర్‌లో చదవాల్సిన సబ్జెక్టులు తప్పక చదవాలి.
- ఉదాహరణకు తెలంగాణ బోర్డు తీసుకుందాం. సైన్స్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీని ఇతర లాంగ్వేజ్ సబ్జెక్టులతో ఎంచుకుంటారు. ఇంజినీరింగ్ చదవాలంటే మ్యాథమెటిక్స్, మెడిసిన్ చదవాలంటే బయాలజీతో ఇతర సైన్స్ సబ్జెక్ట్స్‌ను ఎంచుకోవాలి. కామర్స్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, కామర్స్ లేదా పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, కామర్స్‌ను తీసుకోవచ్చు. అలాగే హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ సబ్జెక్టులు తీసుకున్నా మంచి అవకాశాలు కూడా ఉన్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం వొకేషనల్ కోర్సులను కూడా తెలంగాణ బోర్డు అందిస్తుంది. వాటికి తగ్గ ఉద్యోగ అవకాశాల గురించి https://tgbie.cgg.gov.in/home.do) వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

## బెస్ట్ పది కెరీర్లు

### ఇంజినీరింగ్



- ఎటు చూసినా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా, రోబోటిక్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటివి వినిపిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీర్స్, డేటా సైంటిస్ట్స్ ఇలా ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఏరోస్పేస్ ఇంజినీరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి కొత్త బీటెక్ ప్రోగ్రామ్‌లు పుట్టుకొస్తున్నాయి.
- ఇంజినీరింగ్ చదవాలంటే జేఈఈ మెయిన్స్/అడ్వాన్స్‌డ్ స్టేట్ ఎంట్రన్స్ పరీక్షలు, డీమ్డ్ యూనివర్సిటీల ఎంట్రన్స్ పరీక్షలు రాయాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నిర్వహించే ఎంట్రన్స్ పరీక్ష EAPCET. ఇంజినీరింగ్ కాలేజీలు బీటెక్ లేదా బీఈ పట్టాను ఇస్తాయి. బిట్స్ పిలానీ, జేఎన్‌టీయూ వంటి ఎన్నో కాలేజీల్లో ఇంటిగ్రేటెడ్ ఐదు సంవత్సరాల బీటెక్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి.

### మెడికల్ / హెల్త్ కేర్




- ఆరోగ్య సమస్యలను గుర్తించడం, రోగులకు చికిత్స చేయడం, సమగ్ర ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తున్న డాక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు.
- వైద్యంలో లోతైన జ్ఞానం, ఇతరులకు సహాయం చేయాలనే సంకల్పంతో నిరంతరం శ్రమిస్తారు.
- ఎంబీబీఎస్ అంటే బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ అని. వైద్య విద్యకు సంబంధించి ఆయుర్వేద, యునాని, వెటర్నరీ, డెంటల్ వంటి ఎన్నో కోర్సులు ఉన్నాయి. దేశంలో ప్రధానమైన మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ నీట్ (https://neet.nta.nic.in/).


### లా



- న్యాయ వ్యవస్థ న్యాయాన్ని కాపాడుతూ, హక్కులను రక్షిస్తూ, చట్టపరమైన ప్రక్రియలను గైడ్ చేస్తూ తద్వారా న్యాయబద్ధమైన, క్రమబద్ధమైన సమాజ నిర్మాణానికి తోడ్పడుతుంది. లాయర్, అడ్వకేట్, జడ్జి లాంటి వాటి పట్ల మక్కువ ఉన్నవారు లా ని కెరీర్‌గా ఎంచుకోవచ్చు. గ్రాడ్యుయేషన్ తర్వాత సివిల్ లా, క్రిమినల్ లా, కార్పొరేట్ లా, సైబర్ లా, ఇంటర్నేషనల్ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా ఇలా ఎన్నో అవకాశాలు ఉన్నాయి.
- లా కోర్సుల్లో మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ, ఐదు సంవత్సరాల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మూడు సంవత్సరాల కోర్స్ చేయాలంటే బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి. ఇంటర్ తర్వాత లా చేయాలనుకుంటే అయిదేళ్ల ప్రోగ్రాంలో చేరాలి. ఇందులో కూడా బీఏ ఎల్ఎల్‌బీ, బీకామ్ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ ఎల్ఎల్‌బీ లాంటి ప్రోగ్రామ్స్ ఉన్నాయి. లా కోసం రాసే ఎంట్రన్స్ పరీక్షల్లో ముఖ్యమైనది క్లాట్.

### డిజైన్

- ఫ్యాషన్ డిజైనింగ్, గ్రాఫిక్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్, ఫర్నీచర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, సిరామిక్ డిజైన్, యానిమేషన్ డిజైన్, ఫిలిం అండ్ వీడియో డిజైన్ ఇలా ఎన్నో కోర్సులు ఉన్నాయి. డిజైన్ కోర్సుల్లో ఇంటర్ తర్వాత లేదా గ్రాడ్యుయేషన్ తర్వాత కూడా చేరవచ్చు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (NID), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (NIFT) దేశంలో ప్రముఖ కాలేజీలు. ఇంటర్ ఏ స్ట్రీమ్‌లో చదివినా ఎన్ఐడీ/ నిఫ్ట్ పరీక్షలు రాయవచ్చు. b.ftech కి ఇంటర్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి. అలాగే uceed పరీక్ష ద్వారా సుమారు 7 ఐఐటీలు డిజైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఎంపీసీ చదివిన వారు అన్నిటికి దరఖాస్తు చేసుకోవచ్చు. అవి చదవని వారు ఎలిజిబిలిటీ చూసి కొన్నిటికి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. డ్రాయింగ్, స్కెచింగ్ పట్ల ఆసక్తి, క్రియేటివ్ టాలెంట్ ఉన్నవారు ఈ కోర్స్‌పై మక్కువ చూపుతున్నారు.



### పాలిటెక్నిక్



- 10వ తరగతి తరువాత ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్, టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో చేరాలనుకునే వారు పాలీసెట్ పరీక్ష ద్వారా ప్రవేశ అర్హత పొందుతారు. ఈ కోర్సు పూర్తయిన తరువాత టెక్నీషియన్ గా, టెక్నికల్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగావకాశాలు ఉన్నాయి. బీటెక్, బీఎస్సీ, బీకామ్ వంటి కోర్స్‌లో చేరే అవకాశం సీట్ల సంఖ్యను బట్టి ఉంటుంది. https://polycet.sbtet.telangana.gov.in/#!/index
- తోటి వారు ఏమంటున్నారు, ఏం చేస్తున్నారు అనేది పక్కన పెట్టి, మనం ఏం చేయాలి అనే దాని గురించి ఆలోచించి సరైన కోర్సులో చేరాలి.

### హ్యుమానిటీస్

- హ్యుమానిటీస్ స్ట్రీమ్ కోసం ఇంగ్లిష్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జాగ్రఫీ, సోషియాలజీ, సైకాలజీ వంటి సబ్జెక్ట్స్ చదవాలి. తరువాత వారికి నచ్చిన బ్యాచిలర్స్ ప్రోగ్రాంలో చేరవచ్చు. ఎకనామిక్స్, ఫైన్ ఆర్ట్స్, ఫారిన్ లాంగ్వేజ్, జర్నలిజం, క్రిమినల్ లా, లైబ్రరీ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇలా ఎన్నో బీఏ కోర్సులున్నాయి. కంటెంట్ రైటర్స్, లాంగ్వేజ్ ట్రైనర్లు, హిస్టారియన్, సైకాలజిస్ట్ వంటి ఉద్యోగావకాశాలు పొందగలుగుతారు.

సైన్స్: సైన్స్ లేదా మ్యాథమెటిక్స్ వంటి వాటిలో ఆసక్తి ఉన్న వారు, ఆ సబ్జెక్ట్స్ పట్ల అవగాహన కలిగిన వారు ఇంటర్ తరువాత బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ కోర్సుల్లో చేరవచ్చు. బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ, బోటనీ, ఎకనామిక్స్ లాంటి స్టాండర్డ్ అండ్ రెగ్యులర్ కోర్సులు, కంప్యూటర్ సైన్స్, మాస్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ మీడియా లాంటి ఆధునిక కోర్సులు, ఓషనోగ్రఫీ, సెరికల్చర్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, డెయిరీ టెక్నాలజీ, ఫోరెన్సిక్ సైన్స్ లాంటి వైవిధ్య సబ్జెక్ట్స్ ఎన్నో ఉన్నాయి. డిగ్రీ పూర్తి చేసి వీటిలోనే మాస్టర్స్ చేయవచ్చు. సాధారణంగా బ్యాచిలర్ కోర్స్ పూర్తి చేసి డిగ్రీ సాధించాలంటే మూడు లేదా నాలుగు సంవత్సరాలు పడుతుంది. ఆ తరువాత మాస్టర్స్ విద్య సుమారు రెండు సంవత్సరాలు పట్టవచ్చు. కానీ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్స్, ఇంటర్ తర్వాత వీటిలో అడ్మిషన్ తీసుకోవచ్చు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లాంటివి ఇంటిగ్రేటెడ్ సైన్స్ కోర్సెస్ ఆఫర్ చేస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఇలా ఎన్నో ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

### ఇంటిగ్రేటెడ్ కోర్సెస్

- పదో తరగతి తరువాత ఐఐఐటీ బాసరలో అడ్మిషన్స్‌తో ప్రి యూనివర్సిటీ, ఇంజినీరింగ్ 6 సంవత్సరాల కోర్స్‌ను అందిస్తున్నారు. (https://www.rgukt.ac.in/academicprogrammes.html).


### ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్)

- వివిధ కర్మాగారాల్లో కావాల్సిన స్కిల్డ్ వర్కర్స్‌ని సమకూర్చడానికి గవర్నమెంట్ ఈ కోర్స్‌ను ప్రారంభించింది. తెలంగాణలో 63 ప్రభుత్వ, 219 ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్స్ ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 26 ఇంజినీరింగ్, 12 నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ కోర్స్‌లో చేరాలంటే 10వ తరగతి తరువాత చేరవచ్చు. కొన్ని కోర్సుల్లో 8వ తరగతి పాసైనా సరిపోతుంది. https://iti.telangana.gov.in/ ట్రైనింగ్ పీరియడ్‌లో సుమారు 70 శాతం ప్రాక్టికల్ ట్రైనింగ్ నడుస్తుంది.



### మేనేజ్‌మెంట్

- మేనేజ్‌మెంట్ కోర్సులు లీడర్‌షిప్ స్కిల్స్, డెసిషన్ మేకింగ్, క్రిటికల్, స్ట్రాటజిక్ థింకింగ్‌తో సమస్యలను పరిష్కరించగలిగే నైపుణ్యాలను నేర్పిస్తాయి. ఈ కోర్సులు కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్‌ని మెరుగుపరుస్తాయి. ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్, హ్యూమన్ రీసోర్సెస్ వంటి వ్యాపార నిర్వహణకు అవసరమైన కీలక రంగాల్లో పరిజ్ఞానాన్ని అందిస్తాయి. సేల్స్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్, బిజినెస్ అనలిస్ట్ వంటి అవకాశాల నుంచి కంపెనీలో అత్యున్నత పదవి వరకు ఎదిగే అవకాశం ఉంటుంది. టూరిజం, ట్రావెల్ వ్యాపారాలు, హోటళ్లు పెరగడం వల్ల హోటల్ మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్‌కు అవకాశాలు పెరిగాయి. ఫుడ్ అండ్ బేవరేజెస్, ఎయిర్ లైన్స్ సెక్టార్‌లో మంచి అవకాశాలు ఉన్నాయి.



- మేనేజ్‌మెంట్ కోర్సులు బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ). కుటుంబ వ్యాపారం లేదా సొంత వ్యాపారం వైపు మొగ్గు చూపేవారు, మేనేజ్‌మెంట్ కెరీర్ పట్ల ఆసక్తి ఉన్నవారు ఇంటర్ తర్వాత బీబీఏ ప్రవేశ పరీక్షలు రాయాలి. ఎంబీఏకు పేరున్న ఐఐఎంలు, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (5 సంవత్సరాలు) కోర్సులు ప్రవేశపెట్టారు. గ్రాడ్యుయేషన్ తర్వాత మేనేజ్‌మెంట్ కోర్స్ చేయాలనిపిస్తే ఎంబీఏ ఎంట్రన్స్ పరీక్ష క్యాట్ రాయాలి.
- హోటల్ మేనేజ్‌మెంట్ కోర్స్ కోసం రాసే పరీక్షల్లో ప్రధానమైనది NCHM JEE. బ్యాచిలర్ ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్, ట్రావెల్, హాస్పిటాలిటీ, కలినరీ స్కూల్ ఇలా ఎన్నో కోర్సులు ఉన్నాయి.

### కామర్స్

- కామర్స్ కోర్సుల్లో చేరే వారు సాధారణంగా కామర్స్, అకౌంట్స్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్ వంటి సబ్జెక్టులు చదవాలి. అకౌంటింగ్, ఫైనాన్స్, బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్ సెక్టార్లలో ఉద్యోగం చేయాలనుకునే వారికి సరైన కోర్సు. అలాగే చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటింగ్ లేదా కంపెనీ సెక్రటరీ లాంటి కెరీర్‌కు కూడా బీకామ్ ఉపయోగపడుతుంది. బీకామ్ రెగ్యులర్, బీకామ్ ఆనర్స్, బీకామ్ ఇంటర్నేషనల్ బిజినెస్, బీకామ్ ఫైనాన్స్ ఇలా ఎన్నో కోర్సులున్నాయి. సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (CUET) ద్వారా దేశంలోని అనేక సెంట్రల్, ఇతర యూనివర్సిటీల్లో కామర్స్‌తో పాటు ఇతర కోర్సుల్లో చేరే అవకాశం ఉంది.
- సీఏ (చార్టర్డ్ అకౌంటెన్సీ) ఒక ప్రొఫెషనల్ కోర్సు. పది తర్వాత ఫౌండేషన్ కోర్స్‌లో చేరి, పన్నెండు తర్వాత ఇతర సీఏ కోర్సుల్లో రిజిస్టర్ అయ్యి పరీక్షలు, ప్రాక్టీస్ పూర్తి చేయాలి. కామర్స్ గ్రాడ్యుయేట్ లేదా వేరే గ్రాడ్యుయేషన్ చేసిన వాళ్లు డైరెక్ట్‌గా ఇంటర్మీడియట్ పరీక్షకు రిజిస్టర్ అయ్యి అక్కడి నుంచి కంటిన్యూ చేయవచ్చు. (https:// resource.cdn.icai.org/ 74483 bos-nset.pdf). వీరికి మ్యాథమెటిక్స్ చాలా అవసరం.
- సీఏ లాగా కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ), కంపెనీ సెక్రటరీ (సీఎస్) వంటి కోర్సులు ఎన్నో ఉన్నాయి.

Sirisha Reddy
Director - Academics
Gyanville Academy
Technologies
+91 7386660269
www.gyanville.in

